సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



ఉత్కంఠగా బండలాగుడు పోటీలు

బ్రహ్మంగారిమఠం మండలంలోని సిద్ధయ్యమఠంలో పెద్దవీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా సోమవారం బండలాగుడు పోటీలు ఉత్కంఠగా జరిగాయి. -8లో



భక్తుల కొంగుబంగారం బలిజపల్లె గంగమ్మ

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో విశిష్టత సంతరించుకున్న బలిజపల్లె గంగమ్మ జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.2 /24.2

జిల్లాలో సోమవారం 24.2 – 37.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వైభవంగా పల్లకీ సేవ



పల్లకీలో కొలువుదీరిన స్వామి,అమ్మవారు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకీ సేవ సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాఢవీధులు, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు.కార్యక్రమంలో ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్

కడపకోటిరెడ్డిసర్కిల్: రిజిస్ట్రేషన్‌శాఖలో క్రయ, విక్రయాలకు స్లాట్ సదుపాయం అందుబాటులోకి రానుంది. కక్షిదారులకు సులభతర, వేగవంతమైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ సదుపాయాన్ని కల్పిస్తోంది. జిల్లాలో తొలుత కడప ఆర్ఓ కార్యాలయంలో అమలు కానుంది. పనిదినాల్లో ఉదయం 10–30 గంటల నుంచి సాయంత్రం 5–30 మధ్యలో స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు. ఈ విధానం వల్ల రోజంతా నిరీక్షించే పనితప్పుతుంది. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి నిర్ణీత సమయంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి వుంటుంది. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా రిజిస్ట్రేషన్ సులభతరంగా పూర్తవుతుంది. ఈ విధానం విజయవంతం అయితే రాబోవు రోజుల్లో అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రవేశ పెట్టేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. కాగా కడప ఆర్ఓ కార్యాలయంలో ఏప్రిల్ 4 నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు.ఈసందర్భంగా జిల్లా రిజిస్ట్రార్ పీవీఎస్.బాబు మాట్లాడుతూ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే సమయం వృథా కాదని తెలిపారు.

విభజన హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దశరథరామిరెడ్డి

కడప రూరల్: ఉమ్మడి రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా జై హింద్ పార్టీ, సమాజ్‌వాది పార్టీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా జై హింద్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ హామీల అమలులో భాగంగా కడపకు స్టీల్ ప్లాంట్, దుగ్గిరాజుపట్నం ఎయిర్‌పోర్ట్, వైజాగ్–చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్, విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడంతోపాటు నీటి ప్రాజెక్టులు, విద్యా, పారిశ్రామిక ప్రగతికి చెందిన ఎన్నో అంశాలు అమలు కావాల్సివుందన్నారు. కార్యక్రమంలో సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రి రాజ శ్రీనివాస రావు, చంద్రశేఖర్, సీఆర్‌వీ ప్రసాద్, ఓబయ్య తదిరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోసం అల్లాను ప్రార్థిద్దాం

- ముఫ్తీ న్యామతుల్లా సాహెబ్
- భక్తిశ్రద్ధలతో ఈదుల్ ఫితర్ ప్రత్యేక ప్రార్థనలు
- సామూహిక ప్రార్థనల్లో పెద్దదర్గా పీఠాధిపతి, డిప్యూటీ సీఎం



సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న పెద్దదర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, నగర ప్రముఖులు, ముస్లింలు



రంజాన్ సందేశాన్ని అందజేస్తున్న ముఫ్తీ న్యామతుల్లా సాహెబ్



శుభాకాంక్షలు తెలుపుకొంటున్న చిన్నారులు

కడప కల్చరల్: సంతోషం నిండైన వదనాలు.. చిరునవ్వుల పలకరింపులు.. భక్తులందిరిలోనూ భక్తిభావం .. ఏకేశ్వరుడైన అల్లాహ్ గురించే 'తక్బీర్' చెబుతున్నారు. అల్లాహ్‌పైన గల అచంచల విశ్వాసాన్ని నిరూపించుకునేందుకు తపించారు. మనసు నిండా అల్లాహ్ బోధనలే. ప్రతి భక్తునికి మరో భక్తునితో ఆధ్యాత్మికమైన బాంధవ్యం పెనవేసుకుంటున్న దృశ్యాలు. మనసును ఉల్లాస పరిచే అత్తరు పరిమళాలు. ఆత్మీయతను పెంచుతూ ఆలింగనాలు.. వెరసి రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పవిత్రమైన ఈదుల్ ఫితర్ పండుగ ప్రత్యేక ప్రార్థనలు ముస్లింలు సోమవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఉదయం 7.30 గంటల నుంచి ప్రారంభమైన ప్రత్యేక ప్రార్థనలు మధ్యాహ్నం 12.30 వరకు సాగాయి. కొందరు మసీదులలో ప్రార్థనలు చేయగా, ఎక్కువ మంది సమీపంలోని ఈద్గాలలో సామూహికంగా ప్రార్థనలు నిర్వహించారు.

బిల్టప్ వద్ద..

కడప నగరం బిల్టప్ వద్ద గల అమీనియా ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో మత గురువులు ముఫ్తీ న్యామతుల్లా సాహెబ్ పండుగ సందేశాన్ని అందజేశారు. తెలిసో తెలియకో ఏడాదిపాటు చేసిన తప్పులను సమూలంగా కడిగేసే అవకాశం పవిత్రమైన రంజాన్ మాసంలో లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. మానవాళి సుఖ సంతోషాలతో ఉండాలంటే అందరూ ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు చేయాలని కోరారు. ఈ సృష్టి ధనధాన్యాలు, ఇతర సౌకర్యాలు అన్నీ దైవం ఇచ్చేనవేనని, భూమిపై మనదంటూ ఏమి ఉండదని, కానీ మనిషి అజ్ఞాతంతో అన్నీ తానే సాధించినట్లు భ్రమ పడుతున్నాడని, వాటిలో ఏ ఒక్కటి తిరిగి తీసుకు వెళ్లలేడని తెలుసుకోవాలన్నారు. దైవం చూపిన బాటలో నడిచినపుడే జన్మ సార్థకమవుతుందని, అందుకు ఈ పండుగ సందర్భంగా జకాత్, ఫిత్రాలు మంచి మార్గాలని తెలిపారు. అనంతరం పెద్దదుర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో సామూహిక ప్రార్థనలు సాగాయి. ప్రపంచమంతటా శాంతియుతంగా ఉండేలా కరుణించాలని.. దేశం, రాష్ట్రం, మన జిల్లా సుభిక్షంగా ఉండాలని కోరారు. అనంతరం పెద్దదర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ భక్తులచే ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన ఆశీస్సులు అందుకునేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. ప్రాంగణంలో ముస్లింలు సంతోషంతో ఒకరినొకరు హత్తుకుని 'ఈద్ ముబారక్' చెప్పుకొన్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఈద్గాలో రంజాన్ ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉండటం, ట్రాఫిక్‌ను ముందే మళ్లించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగలేదు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వారు జాగ్రత్తలు తీసుకున్నారు. అమీన్ బ్లడ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో ఈద్గా సమీపంలో భక్తులందరికీ మంచినీటి సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, నగర ముస్లిం ప్రముఖులు సయ్యద్ సలావుద్దీన్, అమీర్‌బాబు, సుభాన్ బాషా, నజీర్ అహ్మద్, అఫ్జల్‌ఖాన్, కార్పొరేటర్లు షఫీ, నాసర్ అలీ, ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి పటిష్ట ఏర్పాట్లు

- ఒంటిమిట్టలో 5 నుంచి బ్రహ్మోత్సవాలు
- 11న వైభవంగా కల్యాణోత్సవం
- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



టీటీడీ జిల్లా యంత్రాంగం అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామాలయంలో ఏప్రిల్ 11న జరిగే శ్రీ సీతారాముల కల్యాణానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంటిమిట్ట టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని పరిపాలన భవన సమావేశ మందిరంలో ఎస్పీ అశోక్ కుమార్, టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడుతో కలిసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవ ఏర్పాట్లపై జిల్లా అధికారులు, టీటీడీ అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 5 నుంచి ఏప్రిల్ 15 వరకు శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయన్నారు. అందులో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యాలు లేకుండా జిల్లా, టీటీడీ అధికారులు సంయుక్తంగా, సమన్వయంతో పని చేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా ఏప్రిల్ 11న జరిగే సీతారాముల వారి కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులతోపాటు ప్రముఖులు రావచ్చనే అంచనాతో అన్ని రకాల ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

ఎక్కడా జనం తొక్కిసలాట జరగకుండా అధికారులు, పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రసాదం కౌంటర్ల వద్ద ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ తాగునీరు, అన్న ప్రసాదం కొరత లేకుండా అందేలా చూడాలన్నారు. అలాగే కడప, రాజంపేట వైపు నుంచి ఆర్టీసీ బస్సులు పార్కింగ్, అలాగే ఇతర జిల్లాల నుంచి ఎన్ని బస్సులు వస్తున్నాయో తెలుసుకొని పక్కాగా ప్లాన్ రూపొందించుకొని పార్కింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఒకవేళ పార్కింగ్ దూరంగా ఉంటే అక్కడి నుంచి కల్యాణ వేదిక వద్దకు భక్తులను తీసుకువచ్చేందుకు ఉచిత బస్సులను ఏర్పాటు చేయాలని టీటీడీ జేఈఓకు తెలిపారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ టీటీడీ అధికారులు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమిష్టిగా కృషి చేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ దర్శనం

అంతకు మునుపు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ తితిదే అధికారులు, జిల్లా అధికారులతో కలిసి ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అధికారులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవస్థానం సమీపంలోని శ్రీ కోదండరామస్వామి కల్యాణ వేదికను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీఓలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, టీటీడీ డిప్యూటీ ఈఓ నగేష్, ఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, సీపీఓ వెంకటరావు, డీపీఓ, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణయ్య, డీటీసీ, ఆర్టీసీ అధికారులు, టీటీడీ, ఈఓపీఆర్, పీఆర్ఓలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దాల్మియాతో ఒప్పందం ప్రజలకు తెలియాలి

- భూముల సంగతి తేల్చాలి
- ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిది రెండు నాలుకల ధోరణి
- ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిలు దాల్మియా యాజమాన్యంతో ఎటువంటి ఒప్పందం చేశారో.. ప్రజలందరికీ బహిర్గతం చేస్తే బాగుంటుందని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చిన్న కొమెర్ల, నవాబుపేట, దుగ్గనపల్లి రైతులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దాల్మియా పరిశ్రమపై రెండు నాలుకల ధోరణి అవలంబిస్తున్నారన్నారు. దాల్మియా ప్రజాభిప్రాయ సేకరణలో వారిని బయటపడేసే విధంగా వ్యవహరించారు. బయటికి వచ్చి ప్రజల సమస్యలు పరిష్కారం చేయనిదే రెండో ప్లాంట్ ముందుకు పోదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జడ్జి ముందు సాక్ష్యం చెబితే బాధితులకు న్యాయం జరుగుతుందని.. అలా కాకుండా ప్రజాభిప్రాయ సేకరణలో కలెక్టర్ ముందు తప్పుడు సాక్ష్యం చెప్పి, బయటికి వచ్చి న్యాయం చేస్తామనడం రైతులను నట్టేట ముంచడమే అవుతుందన్నారు. దాల్మియా ప్రజాభిప్రాయ సేకరణలో రైతులు తమ సమస్యలన్నీ వివరించారని తెలిపారు. అయినా జిల్లా కలెక్టర్ ముంపునకు గురి అయ్యే భూముల గురించి ఒక్కమాటకూడ చెప్పలేదన్నారు. దాదాపు 400 ఎకరాల భూమి మునకకు గురి అయితే ప్రస్తుతం ఆభూముల్లో సాగుచేయలేని స్థితి ఉందన్నారు. నిజంగా జిల్లా కలెక్టర్ న్యాయం చేయాలని ఉంటే దాల్మియా యాజమాన్యంతో భూములను కొనుగోలు చేసిన తర్వాతనే.. రెండో ప్లాంట్ ముందుకు వెళ్లాలని, విస్తరణ కోసం పెట్టుకున్న దరఖాస్తును తిరస్కరించాలన్నారు. శాసనసభ్యుడు ఆదినారాయణరెడ్డి రైతులకు నిజంగా న్యాయం చేయాలనే ఆలోచన ఉంటే కలెక్టర్‌కు తన లెటర్‌ప్యాడ్ పైన రైతుల సమస్యలు పరిష్కారం చేసిన తర్వాతనే విస్తరణ పనులు చేపట్టాలని పర్యావరణ శాఖకు నివేదిక ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న కొమెర్ల సర్పంచ్ జగదీశ్వరరెడ్డి, నవాబు పేట భాస్కర్‌రెడ్డి, హృషికేశవరెడ్డి, బడిగించల జనార్దన్, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరువు తాండవం..
కనికరించని ప్రభుత్వం



జిల్లాలో కరువు కరాళ నృత్యం చేసింది. ఖరీఫ్, రబీ సీజన్‌లలో తీవ్ర వర్షాభావం వెంటాడింది. వాన జాడలేక పంటలు నిట్టనిలువునా ఎండిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. కొంత మంది రైతులు పొలాల్లోనే పంటలు వదిలేసుకుని, సర్వం నష్టపోయారు. పశుగ్రాసం కూడా దక్కలేదు. చివరికి అన్నదాత అప్పుల పాలయ్యాడు. ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం అన్యాయమే చేసింది.

- జిల్లా అంతటా దుర్భిక్ష ఛాయలు
- జాబితాలో 10 మండలాలకే చోటు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- మిగతా మండలాల మాటేమిటి?
- మహానాడు నేపథ్యంలో మభ్యపెట్టేందుకే కంటితుడుపు ప్రకటన



వీరపునాయునిపల్లె మండలంలో ఎండిపోయిన వేరుశనగ పంట



ఎర్రగుంట్ల మండలంలో మినుము పంట పండకపోవడంతో దున్నేస్తున్న రైతు

కడప సెవెన్‌రోడ్స్/కడప అగ్రికల్చర్ : రాష్ట్ర ప్రభుత్వం తూతూ మంత్రంగా జిల్లాలో కరువు మండలాలను ప్రకటించింది. రబీ సీజన్‌లో 10 మండలాలను కరువు జాబితాలో చేరుస్తూ సోమవారం జీఓ ఎంఎస్ నంబరు 3ను జారీ చేసింది. మైదుకూరు, దువ్వూరు, బ్రహ్మంగారిమఠం, ఖాజీపేట, చాపాడు, కాశినాయన, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, తొండూరు మండలాల్లో కరువు తీవ్రత అధికంగా ఉన్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. మైలవరం మండలాన్ని మోడరేట్ డ్రాట్ కింద చేర్చింది. మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని మొత్తం మండలాలు కరువు కింద చూపారు. కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలోని మండలాలు ఇందులో అధికంగా ఉండటం గమనార్హం.

తీవ్ర వర్షాభావం

జిల్లా అంతటా తీవ్ర వర్షాభావం చోటు చేసుకుంది. జిల్లా సాధారణ వర్షపాతంలో 14.1 శాతం లోటు ఏర్పడింది. వరి, పత్తి, జొన్న, మినుము, కంది, తదితర 18 రకాల పంటల సాధారణ సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. తీవ్ర వర్షపాత లోటు, డ్రైస్పెల్స్ కారణంగా సాగు చేసిన పంటలు నిలువునా ఎండిపోయాయి. పెద్దముడియం మండలంలో వర్షపాత లోటుతోపాటు రెండు డ్రైస్పెల్స్ అంటే వరుసగా 42 రోజులు వర్షమే పడలేదు. కలసపాడు, తొండూరు, వేంపల్లె మండలాల్లో కూడా రెండు డ్రైస్పెల్స్ చోటు చేసుకున్నాయి. పోరుమామిళ్ల, గోపవరం, అట్లూరు, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లో ఒక్కొక్క డ్రైస్పెల్స్ చొప్పున నమోదయ్యాయి. బద్వేలు మండలంలో మాత్రం డ్రైస్పెల్ లేకపోయినా వర్షపాత లోటు ఏర్పడింది. జూన్ 4 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు రెఫరెన్స్ పీరియడ్‌గా తీసుకున్నారు. వర్షపాత లోటు, డ్రైస్పెల్స్‌లు విపత్తుల నిర్వహణ విభాగం మ్యాండేటరీ ఇండికేటర్స్‌గా పరిగణిస్తుంది. ఒక మండలాన్ని కరువు కింద ప్రకటించాడానికి ఈ రెండు తప్పనిసరిగా ఉండాలి. పంటల సాగు విస్తీర్ణం, రిమోట్‌సెన్సింగ్ మాయిశ్చర్ అడక్వేట్ ఇండెక్స్, హైడ్రోలాజికల్ ఇండెక్స్‌లను ఇంపాక్ట్ ఇండికేటర్స్‌గా తీసుకుంటారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని పరిశీలిస్తే.. జిల్లాలో దాదాపు అన్ని మండలాలను కరువు జాబితా కింద చేర్చాల్సి వుంటుంది. కానీ అప్పట్లో అధికారులు గ్రౌండ్ ట్రూతింగ్ పేరిట ఒక తప్పుడు నివేదికను కమిషనర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు పంపారు. ఆ నివేదిక ఆధారంగా జిల్లాలో ఒక్క మండలాన్ని కూడా కరువు కింద ప్రకటించలేదు.

ఆందోళనల నేపథ్యంలో..

ప్రభుత్వ వైఖరిపై జిల్లా రైతాంగంలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. జిల్లా సమీక్ష కమిటీ సమావేశం ఎదుట సీపీఐ నాయకులు ఆందోళన నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు ఈ అంశాన్ని లేవనెత్తారు. ఆ తరువాత కాలంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులను నిలదీశారు. కరువు మండలాల ప్రకటన చేయకపోవడంపై జిల్లా అంతటా విమర్శలు వెల్లువెత్తాయి. ప్రజలకు సమాధానం చెప్పలేక జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు తల పట్టుకోవాల్సి వచ్చింది. జిల్లాలో అధిక అసెంబ్లీ స్థానాలను ప్రజలు ఎన్డీఏ కూటమికి కట్టబెట్టినా అభివృద్ధి చేయకపోగా.. కొప్పర్తి ఎంఎస్ఎంఈ, ఏపీజీబీ ప్రధాన కార్యాలయం వంటి వాటిని అమరావతికి ప్రభుత్వం తరలించింది. ఇది కూటమి నేతలను మరింత ఇరకాటంలోకి నెట్టింది. మే నెలలో తెలుగుదేశం పార్టీ కడపలో మహానాడు నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో జిల్లాకు ఏమి చేశారని ఇక్కడ మహానాడు జరుపుతున్నారంటూ ప్రజలు ప్రశ్నించే అవకాశం ఉంది. కనీసం కంటి తుడుపుగా కరువు మండలాలను ప్రకటించాలని భావించే ప్రభుత్వం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. 10 మండలాలను మాత్రమే కరువు కింద ప్రకటిస్తే మిగతా మండలాల పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

భక్తుల కొంగుబంగారం బలిజపల్లె గంగమ్మ

- రేపు రాత్రి నుంచి జాతర ప్రారంభం
- జాతరకు రెండు వందల ఏళ్లకు పైగా చరిత్ర

రాజంపేట టౌన్ : రాజంపేట మున్సిపాలిటీ పరిధిలోని బలిజపల్లెలో స్వయంభువుగా వెలసిన గంగమ్మ ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఎంతో విశిష్టత సంతరించుకుంది. రెండు వందల ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ జాతరకు ఏటా లక్ష మందికిపైగా భక్తులు హాజరై అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పిస్తారు. అమ్మవారికి వరపడితే తమ కష్టాలు తొలగిపోతాయని, కోరిన కోర్కెలు గంగమ్మ నెరవేరుస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే బలిజపల్లె గంగమ్మ భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతుంది. బుధవారం రాత్రి నుంచి జాతర ప్రారంభం కానుంది.

సంప్రదాయాల సమ్మేళనం

బలిజపల్లె గంగమ్మ జాతర అనేక సంప్రదాయాల సమ్మేళనం. బలిజపల్లె, తుమ్మల అగ్రహారం, నారపురెడ్డిపల్లె గ్రామ ప్రజలు కలిసి అమ్మవారి జాతర నిర్వహిస్తారు. తొలుత బలిజపల్లె వాసులు తేదీ నిర్ణయించి అనంతరం తుమ్మల అగ్రహారం, నారపురెడ్డిపల్లె నిర్వాహకులతో చర్చిస్తారు. అంగీకారం రాగానే జాతర తేదీ ఖరారు చేశారు. ఆదివారం జాతరకు అంకురార్పణ చేసి గురువారం జాతర నిర్వహించనున్నారు. ఆయా గ్రామాల ప్రజలు అమ్మవారికి వివిధ రకాల సాంగ్యాలతో జాతర ఘనంగా నిర్వహిస్తారు.



భక్తులకు దర్శనమిచ్చే అమ్మవారి రూపం (ఫైల్)

బలిజపల్లెలో అమ్మవారి ప్రతిమ

జాతరలో కొలువుదీరే గంగమ్మ ప్రతిమను బలిజపల్లెలోని ఓ వేపచెట్టు కింద దాదాపు ఆరు గంటల పాటు కష్టపడి తయారుచేస్తారు. అనంతరం ప్రతిమను నిర్వాహకులు పూల రథంపై ఊరేగిస్తారు. వేపమండలతో తయారు చేసిన గుండిలో తీసుకొచ్చి కొలువుదీర్చుతారు. అమ్మవారు గుడిలోకి వచ్చే సమయంలో భక్తులు పెద్దఎత్తున నైవేద్యాలు ఎదురుగుంభంగా ఇచ్చేందుకు పోటీపడతారు. యాభై అడుగుల దూరంలో ఉండే గుడిలోకి అమ్మవారిని తీసుకురావడానికి దాదాపు రెండు గంటల సమయం పడుతుంది. బలిజపల్లె నిర్వాహకులు విశేషంగా పూజలు నిర్వహించి సాంగ్యాలు సమర్పిస్తారు. అమ్మవారు కొలువుదీరగానే జాతర ఊపందుకుంటుంది.

తుమ్మల అగ్రహారం నుంచి గండదీయలు

బలిజపల్లెలో కొలువైన గంగమ్మకు తుమ్మలఅగ్రహారం పుట్టినిల్లు అని పెద్దలు చెబుతారు. దీంతో గ్రామ మహిళలు బుధవారం రాత్రి బలిజపల్లె గ్రామానికి గండదీయలను తీసుకెళ్తారు. గురువారం వేకువ జామున గుడిలో కొలువుదీరాక మహిళలు తీసుకొచ్చిన గండదీయలను చెల్లిస్తారు. ఈ సమయంలో గంగమ్మను దర్శించుకునేందుకు వేలాది మంది బారులు తీరుతారు. అగ్రహారం మహిళలకు ప్రత్యేకమైన గౌరవం ఇచ్చి చెల్లించే ఏర్పాట్లుచేస్తారు.

నారపురెడ్డిపల్లె నుంచి నవధాన్యాలు

జాతర సందర్భంగా గంగమ్మ తల్లికి నారపురెడ్డిపల్లెకు చెందిన జాతర నిర్వాహకులు, ప్రజలు బుధవారం రాత్రి నవ ధాన్యాలు తీసుకొస్తారు. గంగమ్మ సోదరుడైన పోతు రాజును తప్పెట్లతో ఉత్సాహంగా బలిజపల్లెకు తీసుకొస్తారు. పోతురాజు ఊరేగుతూ వచ్చే సమయంలో భక్తులు కర్రసాము, ఐదడుగుల వ్యక్తులు నృత్యాలు చేస్తూ కోలాహలంగా బలిజపల్లెకు చేరుకుంటారు.

ఇది మా పూర్వజన్మ సుకృతం



బలిజపల్లె గంగమ్మ తల్లి సత్యమైన దేవత. గంగమ్మను పూజించి ఏకార్యం చేపట్టినా నెరవేరుతుంది. అందువల్ల మా ఊళ్లో వాళ్లే గాక ఎక్కడెక్కడి వాళ్ళో వచ్చి అమ్మవారిని పూజించి తమ కార్యాలు ప్రారంభిస్తారు. బలిజపల్లె గ్రామంలో మేము జన్మించడం మా పూర్వ జన్మ సుకృతం.

\- కోనిశెట్టి వెంకటయ్య, బలిజపల్లె, రాజంపేట

ఊరంతా సందడి



వేర్వేరు చదివే పిల్లలు, ఉద్యోగాలు చేసే వారంతా బలిజపల్లె గంగమ్మ జాతరకు ఇంటికి వస్తారు. ఊరంతా ఆ రోజుల్లో సందడిగా ఉంటుంది. అందరి ఇళ్లు బంధువులతో కళకళలాడుతాయి. వచ్చిన వారంతా బంధువుగా నన్ను పలకరించడంతో మనసు పులకరించిపోతుంది. జాతరలో మా ఊరికి భాగస్వామ్యం ఉండటం అదృష్టం.

\- అనంతరాజుగారి గంగమ్మ, తుమ్మల అగ్రహారం, రాజంపేట మండలం

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఖాజీపేట : జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు సి.చక్రవర్తి(29) సోమవారం మృతిచెందాడు. ఖాజీపేట పంచాయతీ బుడ్డాయపల్లె గ్రామానికి చెందిన చక్రవర్తి(చక్రీ) ఆదివారం రాత్రి ఖాజీపేట నుంచి బుడ్డాయపల్లెకు బయలుదేరాడు. హైవే క్రాస్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. తీవ్ర గాయాలైన చక్రవర్తిని స్థానికులు కడప రిమ్స్‌కు తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. చక్రవర్తి భార్య ఫిర్యాదు మేరకు.. ఖాజీపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంధువుల నిరసన

చక్రవర్తి హైయ్యర్ బస్సుల్లో డ్రైవర్‌గా వెళ్తున్నారు. తోటి డ్రైవర్ మృతి చెందిన విషయం తెలుసుకుని మృతుడి బంధువులు, డ్రైవర్లు ప్రొద్దుటూరు హైయ్యర్ వాహనాల యజమాని వద్ద నిరసన తెలిపారు. మృతుడికి తమ సంతాపం తెలిపారు.

ఇరు వర్గాల ఘర్షణ



గాయపడిన ఆవుల ప్రసాద్

కొండాపురం : మండలంలోని బెడుదూరు గ్రామంలో జరిగిన ఇరువర్గాల ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్‌ఐ హృషికేశవ రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాలమేరకు.. ఇరు వర్గాల వారు తమ పిల్లలు కొట్లాడుకున్నారనే విషయంలో గొడవపడ్డారు. మాటా మాటా పెరగడంతో ఓ వర్గానికి చెందిన ఆవుల ప్రసాద్‌పై మరో వర్గం దాడి చేసింది. ప్రసాద్‌కు గాయమవడంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు. వెంకటేష్, మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బస్సు ఢీకొని యువకుడికి గాయాలు

సిద్దవటం: బస్సు ఢీకొని యువకుడు గాయపడ్డారు. మండలంలోని సంటిగారిపల్లె గ్రామానికి చెందిన ప్రదీప్‌కుమార్‌రెడ్డి సేల్స్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం కూడా సిద్దవటం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. కడప నుంచి బద్వేల్ వైపునకు వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొంది. ప్రదీప్‌కు తీవ్ర గాయాలవడంతో కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. ప్రదీప్‌కుమార్‌రెడ్డి తండ్రి రామక్రిష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మదనపల్లె : ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు వన్ టౌన్ సీఐ ఎరిషావలి తెలిపారు. గత మార్చి 22న గుర్తుతెలియని వ్యక్తి పట్టణంలోని బెంగళూరు బస్టాండులో మద్యం తాగి అపస్మారస్థితిలో పడిపోయారు. స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం స్వల్పంగా కోలుకున్న అతడు తన పేరు జయరాం(55)గా పేర్కొన్నారు. ఇతర వివరాలు ఏమీ తెలపలేని స్థితిలో ఉండగా, పరిస్థితి విషమించి 31న తిరుపతి రూయా ఆస్పత్రిలో మృతిచెందాడు. అతని సంబంధీకులు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

రూ.500 దొంగనోటు ఇచ్చి పరారీ

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులో గత రెండు రోజులుగా దొంగ నోట్లు ప్రత్యక్షమవుతున్నాయి. ఆదివారం సాయంత్రం స్థానిక కుందూనది వద్ద చాపాడుకు చెందిన శాంతమ్మ దోస పండ్ల వ్యాపారం చేసుకుంటోంది. ఓ వ్యక్తి బైక్‌లో వచ్చి రూ.100లకు దోస పండ్లు కొనుగోలు చేశాడు. రూ.500 నోటు ఇచ్చి రూ.400 చిల్లర తీసుకుని వెళ్లాడు. ఇంతలో పిల్లలు అది దొంగ నోటుగా గుర్తించి వెతికేలోగా బైక్‌లో వచ్చిన వ్యక్తి పరారయ్యాడు. సోమ వారం చాపాడులోని ఓ స్వీట్స్ బేకరిలో స్వీట్లు కొనుగోలు చేసిన వ్యక్తి దొంగనోటు మార్చుకుని పరారైనట్లు తెలిపారు. గత రెండు రోజుల్లో దొంగ నోట్లు చలామణీ కావడంతో చాపాడుకు చెందిన ఎస్.ఓబులేసు ట్రైనీ డీఎస్పీ భవానీకి ఫిర్యాదు చేశారు.



చాపాడులో మార్చబడిన రూ.500 దొంగనోటు

దాయాదుల మధ్య భూ వివాదం

- కత్తులు, రాడ్లతో ఇరువర్గాల దాడులు
- ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు
- బైక్‌కు నిప్పు పెట్టడంతో దగ్ధం



దగ్ధమైన బైకులు

బ్రహ్మంగారిమఠం : భూ వివాదం ఇరు వర్గాల మధ్య పరస్పర దాడులకు దారి తీసింది. ఆ భూములు తమవేనంటూ ఇరువర్గాల దాయాదులు ఘర్షణకు దిగి కత్తులు, రాడ్లతో దాడులు చేసుకోవడంతో ఒకరు మృతి చెందగా.. ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని సోమిరెడ్డిపల్లె పంచాయతీ మద్దిరెడ్డిపల్లె గ్రామంలో నివాసముంటున్న పెసల నారాయణరెడ్డి, పెసల జయరామిరెడ్డి దాయాదులు. వారికి సోమిరెడ్డిపల్లె పొలం సర్వే నెంబరు 159, 160లో 4.5 ఎకరాల పిత్రార్జిత వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమి తమదంటే తమదే అంటూ ఇరువర్గాలు చిన్న చిన్న ఘర్షణ పడుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో పెసల నారాయణరెడ్డి బద్వేల్ కోర్టును ఆశ్రయించగా.. నారాయణరెడ్డి పొలంలో సాగు చేసుకునేందుకు అనుమతిచ్చింది. రెండు రోజుల కిందట నారాయణరెడ్డి ఆయన సోదరులు ట్రాక్టర్‌తో పొలంలో దుక్కులు చేస్తున్నారు. ఇది సహించని జయరామిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు అడ్డుకోవాలనుకుని సోమవారం సాయంత్రం పొలం వద్దకు వచ్చి ఘర్షణపడ్డారు. జయరామిరెడ్డి ఆయన సోదరులు కత్తులు, రాడ్లు పట్టుకుని ఆగ్రహంతో దాడి చేస్తున్నారని, నారాయణరెడ్డి సోదరులకు తెలిసింది. దీంతో వారు బైకుపై పొలం వద్దకు వచ్చారు. అప్పటికే నారాయణరెడ్డి(60) గాయాలతో కింద పడి ఉన్నారు. ఇది చూసిన నారాయణరెడ్డి సోదరులు వాగ్వాదానికి దిగారు. మాటా మాటా పెరిగి ఘర్షణ తలెత్తడంతో ఇరువర్గాలు దాడులు చేసుకున్నాయి. జయరామిరెడ్డి, ఆయన కుమారుడు సాంబశివారెడ్డి, తమ్ముడు మల్లికార్జునరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. నారాయణరెడ్డి మృతిచెందగా ఆయన బంధువులు శివారెడ్డి, ఆదిలక్ష్మమ్మలకు గాయాలయ్యాయి. బైక్‌లకు నిప్పు పెట్టడంతో ఐదు బైకులు దగ్ధమయ్యాయి. బి.మఠం ఎస్‌ఐ చంద్రశేఖర్, సిబ్బంది వెళ్లి ఘర్షణను అడ్డుకున్నారు. తీవ్రగాయాలతో ఉన్న వారిని కడప ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఘర్షణలో మృతిచెందిన పెసల నారాయణరెడ్డి



గాయాలతో పెసల జయరామిరెడ్డి

బ్రౌన్ భవన నిర్మాణ పనులు ప్రారంభించండి

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నూతన భవన నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని గ్రంథాలయ సలహా మండలి సభ్యులు జానుమద్ది విజయభాస్కర్ విజ్ఞప్తి చేశారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలలో పాల్గొనేందుకు విచ్చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు కడప నగరంలోని బ్రౌన్ గ్రంథాలయ నూతన భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేయాలనిలాయనకోరారు. 2023 డిసెంబర్‌లో నాటి ప్రభుత్వం రూ.6.87 కోట్ల నిధులు మంజూరు చేసిందని, పలు కారణాలతో ఆగిపోయాయని తెలిపారు. ముఖ్యమంత్రి చొరవచూపి భవన నిర్మాణం ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు. కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరిని కలిసి విజ్ఞప్తి చేశారు.

ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్ తనిఖీ



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న కడప జిల్లా ఎస్పీ ఈజీ. అశోక్ కుమార్

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉమెన్స్ హెల్ప్ డెస్క్‌పై సిబ్బందికి సూచనలు చేశారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం స్టేషన్ పరిసరాలు పరిశీలించి స్టేషన్ ఆవరణంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పెండింగ్ కేసులు త్వరగా విచారించి పరిష్కరించాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, కోదండరాముడి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయాలని ఆయన ఆదేశించారు.

కుమార్తెను ఇంటికి పంపమన్నందుకు మామపై అల్లుడు దాడి

రాయచోటి టౌన్ : తన కుమార్తెను రంజాన్ పండగకు పుట్టింటికి పంపమన్నందుకు మామపై అల్లుడు దాడి చేసిన సంఘటన రాయచోటిలో శనివారం చోటుచేసుకొంది. బాధితుల కథనం మేరకు.. రాయచోటి పట్టణంలోని పాత రాయచోటికి చెందిన అజ్మత్ తన కుమార్తె తంజీమ్‌ను అదే ప్రాంతానికి చెందిన మహబూబ్‌బాషా కుమారుడు జుబేర్‌కు ఇచ్చి ఏడాది కిందట వివాహం చేశారు. పెళ్లిరోజున ఇచ్చిన బంగారు ఆభరణాలు అమ్మే శాడని ఇటీవల భార్య, భర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఇంతలో రంజాన్ పండగ రావడంతో అల్లుడు, కుమార్తె, బంధువులను పండగకు పిలిచేందుకు తన కుమార్తె ఇంటికి అజ్మత్ వెళ్లారు. వారు పంపేందుకు నిరాకరించడమేగాక అజ్మత్‌తో ఘర్షణ పడ్డారు. వాగ్వాదం పెరిగి అల్లుడి బంధువులు అజ్మత్‌పై దాడి చేసి గాయపరిచారు. పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు.

ఉత్కంఠగా బండలాగుడు పోటీలు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని సిద్ధయ్యమఠంలో పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలలో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఆద్యంతం పోటీలు ఉత్కంఠగా సాగాయి. నంద్యాలకు చెందిన కేశవరెడ్డి ఎద్దులు ప్రథమ స్థానంలో నిలవగా యజమానికి రూ.1,00,116 నగదు జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి అందజేశారు. ప్రొద్దుటూరుకు చెందిన మార్తల వెంకటరెడి ఎద్దులు ద్వితీయ స్థానంలో నిలవగా యజమానికి రూ.70 వేల నగదు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వీరనారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మేకల రత్నకుమార్‌యాదవ్, బొగ్గల సుబ్బిరెడ్డి, రామసుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి చిన్న ఓబుల్‌రెడ్డి, నేలటూరు వెంకటరామిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గొడ్లవీడు నాగేశ్వర్‌రెడ్డి, దుగ్గిరెడ్డి, బాలిరెడ్డి, గుండాపురం రమణారెడ్డి, గొడ్లవీడు సిద్దారెడ్డి, జోగయ్య, రామకృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, కానాల మల్లికార్జునరెడ్డి, జొకుపల్లె రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎం.రామగోవిందరెడ్డి

మహిళపై హత్యాయత్నం విఫలం

- స్థానికులు రావడంతో పరారీ
- పత్తూరులో దొరికిన నిందితులు
- వారి వద్ద నుంచి కత్తులు స్వాధీనం



నిందితుడిని చెట్టుకు కట్టేసిన దృశ్యం



నిందితులను ఆటోలో పోలీస్ స్టేషన్‌కు తీసుకెళుతున్న పోలీసులు

ఖాజీపేట : మహిళను హత్య చేసేందుకు వచ్చిన దుండగులు.. ఆమె గట్టిగా కేకలు వేయడం, స్థానికులు రావడంతో పరారయ్యారు. పత్తూరు గ్రామంలో ఒకరిని, రైస్ మిల్లు వద్ద ఒకరిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.పుల్లూరు పంచాయతీ పరిధిలోని బంగ్లా సమీపంలో భాగ్య అనే మహిళ ఉంది.. ఆమె వడ్డీ వ్యాపారాలతో పాటు, రియల్ ఎస్టేట్ బిజినెస్ కూడా చేస్తోంది. ఆమెను హత్య చేసేందుకు రాత్రి వేళ సుమారు 10 మంది యువకులు ద్విచక్రవాహనాల్లో వచ్చారు. ఇంటి తాళం పగుల కొట్టే ప్రయత్నం చేశారు. వీరిని చూసిన భాగ్య కారు డ్రైవర్‌కు ఫోన్ చేసింది. గట్టిగా కేకలు వేసింది. దీంతో డ్రైవర్ శివ అక్కడికి చేరుకున్నాడు. స్థానికులు కర్రలు తీసుకుని దుండగులపై దాడికి ప్రయత్నించారు. దీంతో వారు బైక్‌లు అక్కడే వదిలి పరారయ్యారు. డ్రైవర్ శివ ఒకరిని పట్టుకున్నారు. రైస్‌మిల్లు వద్ద మరొకరిని గ్రామస్తులు పట్టుకుని తీసుకొచ్చారు. వచ్చిన వారంతా అక్కడే బైక్‌లను వదిలి పరారైయ్యారు.

దేహశుద్ధి

పారిపోతున్న వారిలో ఒకరిని పత్తూరు గ్రామంలో, మరొకరిని రైస్ మిల్లు స్థానికులు పట్టుకున్నారు. దొరికిన వారు కత్తులు చూపి భయపెట్టే ప్రయత్నం చేశారు. దీంతో వారిని పట్టుకున్న తర్వాత ఎందుకొచ్చారని స్థానికులు ప్రశ్నించారు.చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశారు.. విషయం పోలీసులకు తెలియజేశారు. సమాచారం తెలుసుకున్న చెట్టుకు కట్టేసిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న కత్తులను స్వాధీనం చేసుకున్నారు. అసలు ఎందుకు వచ్చారు.. హత్య కోసమేనా లేక ఇతర పనుల కోసం వచ్చారా అన్న విషయాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

రైతు ఆత్మహత్య



రఘురామయ్య (ఫైల్)

పుల్లంపేట : వ్యవసాయంలో నష్టాలు వచ్చి అప్పుల పాలైన రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం తిప్పాయిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. తిప్పాయిపల్లి హరిజనవాడకు చెందిన దార్ల రఘురామయ్య (52)కు ప్రభుత్వం ఐదు ఎకరాలు భూమిని మంజూరు చేసింది. అరటి తోటన సాగు చేసి జీవనం కొనసాగిస్తున్నాడు. వాతావరణం అనుకూలించగా, ఆశించిన దిగుబడి రాకపోవడంతో అప్పులు పెరుగుతూ వచ్చాయి. దీంతో రూ.7లక్షలు అప్పుచేసి తీర్చలేక మనస్థాపం చెందారు. ఆదివారం విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అపస్మారక స్థితిలోకి చేరి సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య వరలక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై మృతదేహం

రాజంపేట : నందలూరు–రేణిగుంట రైలు మార్గంలో హస్తవరం రైల్వే స్టేషన్ వద్ద సోమవారం 25 ఏళ్ల వయస్సు కలిగిన యువకుడి మృతదేహం స్థానికులు గుర్తించారు. రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాలు తెలియాల్సి ఉంది.

వృద్ధులకు గాయాలు

ఓబులవారిపల్లె : మద్యం తాగి ఆకతాయిలు రాళ్లు విసరడంతో తేనెటీగలు లేచి ఆశ్రమంలో వృద్ధులపై దాడి చేశాయి. మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామంలో జీవన జ్యోతి ఆనంద నిలయంలో ఆశ్రయం పొందుతున్న ఏడుగురు వృద్ధులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆశ్రమం ప్రక్కనే చెట్టుపై తేనెపట్టు ఉండడం.. ఆకతాయిలు మద్యం తాగి రాళ్లతో కొట్టడంతో అవి వృద్ధులపై దాడి చేయడంతో దిక్కుతోచక వారంతా ఆందోళనకు గురయ్యారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

అక్కానగర్‌లో కత్తిపోట్ల కలకలం

ముగ్గురిని పొడిచి యువకుడు పరార్

కమలాపురం : స్థానిక అక్కా నగర్‌లో ఆదివారం రాత్రి ఇరు వర్గాల యువకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు కత్తిపోట్లకు గురయ్యారు. స్థానికులు, బాధితుల సమాచారం మేరకు..అక్కా నగర్‌లో గతంలో నివాసమున్న సల్మాన్ ఇటీవల ఇందిరమ్మ కాలనీలో చేరారు. పది రోజుల కిందట అక్కానగర్‌కు వచ్చి బైక్‌ను ఎక్కువ స్పీడ్‌తో రైడ్ చేస్తున్నారు. అదే కాలనీకి చెందిన సొహెయిల్, షాబాజ్ స్పీడ్‌తో వెళ్ల వద్దంటూ మందలించారు. అది మనసులో పెట్టుకున్న సల్మాన్ ఆదివారం రాత్రి అక్కానగర్‌కు వచ్చి సోహెల్, షాబాజ్‌లను కత్తితో పొడిచాడు. అడ్డు వచ్చిన రియాజ్‌పైనా దాడికి దిగాడు. స్థానికులు గుర్తించి వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సొహెయిల్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. షాబాజ్, రియాజ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఆసుపత్రికి వచ్చి జరిగిన దాడి గురించి ఆరా తీశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దాడికి పాల్పడిన సల్మాన్ పరారీలో ఉన్నాడు.



తీవ్రంగా గాయపడిన సొహెయిల్‌కు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది





కత్తితో పొడిచిన గాయాన్ని చూపుతున్న బాధితుడు షాబాజ్, గాయపడిన రియాజ్

అనాథ వృద్ధుడి మృతదేహానికి అంత్యక్రియలు

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె రైల్వే స్టేషన్ వద్ద మృతి చెందిన 60 ఏళ్ల వృద్ధుడి మృతదేహానికి కాశీవిశ్వనాథ సేవాసమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. వృద్ధుడు చనిపోయినా బంధువులు ఎవరూ రాకపోవడంతో పోలీసులు స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. హిందూ సంప్రదాయం ప్రకారం సంస్థ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండ్లకొండ రవి, నాగుల రాంప్రసాద్, రెడ్డిలక్ష్మణ్ దామోదర్, మధు, సురేష్, ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.



అంత్యక్రియలకు మృతదేహాన్ని తీసుకెళ్తున్న సభ్యులు